క్లుప్తంగా

నర్సింగ్ సూపరింటెండెంట్‌కు డాక్టరేట్



వరంగల్: వరంగల్ నర్సింగ్ కళాశాలలోని గ్రేడ్ -1 సూపరింటెండెంట్ బీ.లక్ష్మీబాయికి పాండిచ్చేరిలోని కంబన్ కలైరంగం ఆడిటోరియంలో హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను శనివారం ప్రదానం చేసింది. లక్ష్మీబాయి పలు సేవా కార్యక్రమాలు, అనేక వైద్య శిబిరం నిర్వహించడం, నేత్రదానం చేసేందుకు కృషి చేయడంతో పాటు ఆపరేషన్లు చేయించినందుకు ఆమె సేవలను గుర్తించి డాక్టరేట్ అందించారు. డాక్టరేట్ అందుకున్న లక్ష్మీబాయిని సహచర ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభినందించారు.

సర్కిల్ కార్యాలయం తనిఖీ



వరంగల్ అర్బన్: కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాన్ని అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారి చాంబర్, జనన, మరణ ధ్రువీకరణ విభాగం, పర్యవేక్షకులు, టౌన్ ప్లానింగ్ విభాగాల్లోని చాంబర్లను పరిశీలించి, అధికారులు, ఉద్యోగులు హాజరు వివరాలపై ఆరా తీశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలపై సమీక్ష నిర్వహించి తగు సూచనలు చేశారు. సిటిజన్ చార్టర్‌ను పక్కాగా అమలు చేయాలని అనిసుర్ రషీద్ సూచించారు. డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, రెవెన్యూ అధికారి షహజాది బేగం, పర్యవేక్షకులు హబీబ్, ఆర్ఐలు విజయ్, సోహైల్ ఉన్నారు.

'బాల్య వివాహాలు' నేరం



హసన్‌పర్తి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని నేర నిరోధక విభాగం సీఐ ఎన్.వెంకట్రాం హెచ్చరించారు. బాలల అక్రమ రవాణాపై ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సమితి ఆధ్వర్యంలో పెగడపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సహాయం కోసం 100, 102, 1098, 181, 1930 హెల్ప్‌లైన్ సెంటర్లకు కాల్ చేయాలని సూచించారు. ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సమితి మండల కోఆర్డినేటర్ ఇసంపల్లి సుదర్శన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ



కాజీపేట అర్బన్: 31వ డివిజన్‌లోని న్యూశాయంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పాఠశాల పూర్వ ఉపాధ్యాయుడు శ్రీపాది శ్రీనివాసాచారి కుటుంబ సభ్యులు శనివారం కంప్యూటర్‌ను బహూకరించారు. శ్రీపాది శ్రీనివాసాచారి, ఈశ్వరమ్మ సంతానం సోమేశ్వర శర్మ, మహేశ్వర శర్మ, రవి శర్మ.. తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థ కంప్యూటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరోజ, ఉపాధ్యాయులు రవీందర్ రాజు, ఎస్ఎంఎం.స్వామి, దేశమణి, సరళ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

రేపు వయోవృద్ధుల దినోత్సవం

హన్మకొండ: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఈనెల 30న నిర్వహించనున్నట్లు సీనియర్ సిటిజన్ ఫోరం హనుమకొండ జాయింట్ సెక్రటరీ పగడాల సరళ తెలిపారు. హనుమకొండ సర్క్యూట్ హౌస్ రోడ్డులోని ఆర్టీసీ పెట్రోల్ పంపు ఎదురుగా ఉన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం వయోవృద్ధుల దినోత్సవాన్ని జరుపుకోనున్నట్లు ఆమె ఒక ప్రకటనలో వివరించారు. ట్రెజరీస్ డిప్యూటీ డైరెక్టర్ గుజ్జు రాజు ముఖ్యఅతిథిగా, గౌరవ అతిథిలుగా వరిష్ఠ పౌరుల తల్లిదండ్రుల సంక్షేమ ట్రిబ్యునల్ హనుమకొండ సబ్ మెజిస్ట్రేట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ ఎల్.రమేష్, మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి, హనుమకొండ జిల్లా సంక్షేమాధికారి మధురిమ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్, వరంగల్ జిల్లా సంక్షేమాధికారి ఎం.శారద పాల్గొంటారని పేర్కొన్నారు.

ఇద్దరు స్నేహితుల ఘర్షణ

ఖిలా వరంగల్: ఉర్సుగుట్ట జంక్షన్ సమీపంలోని ఓ బార్ షాపులో ఇద్దరు స్నేహితులు గొడవ పడ్డారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మద్యం మత్తులో ఘర్షణ పడి పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ దాడిలో ఓ వ్యక్తి మెడలోని బంగారు చైన్ పోయిందని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు శనివారం ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

వాల్మీకి మహర్షి ఉత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రమేష్, తదితరులు



హసన్‌పర్తిలో పూజలు చేస్తున్న సంఘం నాయకులు



హనుమకొండ హనుమాన్‌నగర్‌లో..

మడికొండ: మడికొండలోని పెద్దమ్మ గుడి వద్ద వాల్మీకి నవరాత్రోత్సవాలు శనివారం ఉదయం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా వాల్మీకి చిత్రపటాన్ని వాల్మీకి భవనం నుంచి డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా పెద్దమ్మ గుడి ఎదురుగా ఏర్పాటు చేసిన మండపం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం వాల్మీకి మహర్షికి వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, వాల్మీకి సంఘం అధ్యక్షుడు బోగి లింగమూర్తి, నిగ్గుల వెంకటప్రసాద్, బోగి వెంకటయ్య, బోగి లింగయ్య, పెనుకుల రవి, బోగి రాజు, దేవరాజ్, నిగ్గుల రవి, కుమారస్వామి, కుల పెద్దలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణం ఎంతో గొప్పదని కొనియాడారు. 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి, వాల్మీకి సంఘం సభ్యులు కుర్ల మోహన్, సాంబయ్య, శ్రీనివాస్, సారయ్య, శంకర్, వినోద్ పాల్గొన్నారు.

భీమారంలో వాల్మీకి జయంతి

హసన్‌పర్తి: వాల్మీకి జయంతి వేడుకల సందర్భంగా భీమారంలోని స్థానిక ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు చేసిన వారిలో కార్పొరేటర్ జక్కుల రజిత, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, వాల్మీకి సంఘం అధ్యక్షుడు సుధాకర్, నాయకులు గోపరబోయిన సాంబయ్య, రవీందర్, సాంబరావు, రాజు పాల్గొన్నారు.

పెగడపల్లిలో..

వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను హసన్‌పర్తి మండలం పెగడపల్లిలోని బోయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం జిల్లా కార్యదర్శి ముచ్చ రాజ్‌కుమార్, సంఘం నాయకులు కుర్ల కొమురెల్లి, ఐలయ్య, సుధాకర్, శ్రీకాంత్, రాజేష్, రాజ్‌కుమార్, సందీప్, రఘుపతి పాల్గొన్నారు.

హనుమాన్‌నగర్‌లో..

హన్మకొండ: హనుమకొండ హనుమాన్‌నగర్ -1లో వాల్మీకి మహర్షి జయంతిని శనివారం జరుపుకున్నారు. వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా వాల్మీకి చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకుడు చల్ల వెంకటేశ్వర్ రెడ్డి, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం, బీఆర్ఎస్ నాయకులు, కాలనీ వాసులు మొట్ల మనోహర్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, వెంకటేష్, మాదారపు ఉదయ్‌కిరణ్, కుమార్‌రెడ్డి, చిర్ర శ్రవణ్, వినోద్, వంశీ, రాకేశ్ పాల్గొన్నారు.

పోలీస్ అమరుల త్యాగాలు మరువొద్దు



రక్తదానం చేస్తున్న పోలీసులు

మామునూరు: పోలీసు అమరవీరుల త్యాగాలను మరువొద్దని టీఎస్ఎస్పీ బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు జయరాం, రాంబాబు, వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బెటాలియన్ యూనిట్ ఆస్పత్రి వైద్యుల పర్యవేక్షణలో ఎంజీఎం బ్లడ్ బ్యాంకు మోటివేటర్ కల్యాణి బృందం సుమారు 56యూనిట్ల రక్తాన్ని సేకరించింది. ముఖ్యఅతిథిగా కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం చేయడం వల్ల ఆపదలోని వ్యక్తుల ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. 56 మంది బెటాలియన్ కానిస్టేబుళ్లు రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సోమని, విజయకుమార్, వెంకటేశ్వర్‌రవు, ప్రియదర్శిని, ఆశాదేవి యూనిట్ ఆస్పత్రి ఫార్మసిస్ట్ జలగం రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



విద్యారణ్యపురి: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం గుగులోతు నెహ్రూ అన్నారు. పాఠశాలలోని విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను తల్లిదండ్రులు పాఠశాలకు క్రమం తప్పకుండా పంపించాలని సూచించారు. ఆధార్ కార్డులాగే ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులందరికి ఆపార్ అనే కార్డు ఎంతో ముఖ్యమని అన్నారు. అది విద్యార్థి ఐడెంటిఫికేషన్‌కు ఎంతగానో దోహదపడనుందని చెప్పారు.

ప్రజా ఆశీర్వాద బలంతో గెలుస్తా..



ప్రతిజ్ఞ చేస్తున్న అసోసియేషన్ నాయకులు

కాజీపేట రూరల్: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో తాను గెలుస్తానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ ధీమా వ్యక్తం చేశారు. 63, 47వ డివిజన్ల పరిధిలో ఇంటింటి ప్రచారాన్ని కాజీపేట చౌరస్తాలో శనివారం ప్రారంభించి కాజీపేట శివారులో ముగించారు. ఈ సందర్భంగా కాజీపేట బాపూజీనగర్ సిద్ధు టెంట్ హౌస్ వద్ద బీఆర్ఎస్ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి వినయ్‌భాస్కర్ ఆహ్వానించారు. కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు, నార్లగిరి రమేష్, బోడ దశరథం, దువ్వ కనకరాజ్, ఎండీ.అఫ్జల్, మర్యాల కృష్ణ, పోతుల సాంబయ్య, సిరిమల్ల దశరథం, సిరిల్‌లారెన్స్, కాంపెల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు. అలాగే, ఆల్ ట్రేడర్స్, కిరాణం అండ్ జనరల్ అసోసియేషన్ నాయకులు వినయ్‌భాస్కర్‌కు మద్దతు తెలిపారు.

బీసీ సీఎంను స్వాగతిస్తున్నాం



హన్మకొండ: రాష్ట్ర శాసనసభకు జరగనున్న ఎన్నికల్లో విజయం సాధిస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని బీజేపీ ప్రకటించడాన్ని బీసీ జేఏసీ స్వాగతిస్తోందని ఆ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు తెలిపారు. బీసీకి సీఎంగా అవకాశం కల్పిస్తామని ప్రకటించిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బీసీ జేఏసీ కృతజ్ఞతలు తెలుపుతూ లేఖ రాశారు. ఆ లేఖను హనుమకొండలో శేషు శనివారం విడుదల చేశారు. చిన్నాల యశ్వంత్ యాదవ్, వినయ్‌చారి, రమేష్ పాల్గొన్నారు.

సాదాబైనామాపై కేసీఆర్‌కు కృతజ్ఞతలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

కాజీపేట అర్బన్: శివారు గ్రామాల రైతుల ప్రధాన సమస్య సాదాబైనామాపై స్పష్టమైన ప్రకటన చేసినందుకు సీఎం కేసీఆర్ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. హంటర్ రోడ్డులోని వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భట్టుపల్లి ఎస్సార్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభకు నియోజకవర్గంలోని తండాలు, గ్రామాలు, డివిజన్ల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రైతు విమోచన కార్పొరేషన్ చైర్మన్ నాగుర్ల వెంకన్న, జిల్లా రైతుబంధు అధ్యక్షురాలు లలితా యాదవ్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు నాగేశ్వరరావు, అరుణ, పీఏసీఎస్ చైర్మన్ వనంరెడ్డి, నాయకులు కంకణాల సంపత్‌రెడ్డి, హరీశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సురేఖకు టికెట్ కేటాయింపుతో హర్షం



స్వీట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను కొండా సురేఖకు కేటాయించడంపై పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు కొత్తవాడ గోపాలస్వామి గుడి జంక్షన్‌లో గొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో దామెర రాజ్‌కమల్, దొంతుల రాజేష్, మంత్రి కమలాకర్, రావుల రాజీవ్‌గాంధీ, గొండ ప్రసాద్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, వరంగల్ సిటీ మహిళా ప్రెసిడెంట్ నారగోని స్వప్న, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శి పుష్ప, తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

కాశిబుగ్గ: వరంగల్ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండా సురేఖను ప్రకటించడంపై కాశిబుగ్గ జంక్షన్, తెలంగాణ జంక్షన్లలో నాయకులు సంబరాలు నిర్వహించారు. టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, నాయకులు దాసరి రాజేష్, నారగోని స్వప్న, గిరిగిరి పుష్ప, సందెల లాజర్, జంగం ప్రభాకర్, జన్ను అరవింద్, నర్సయ్య, సురేష్, జయమ్మ, కిరణ్, కమల్, సందీప్ పాల్గొన్నారు.

తూర్పు అభివృద్ధే నా ధ్యేయం

ఖిలా వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గం అభివృద్ధే తన ధ్యేయమని, రాబోయే ఎన్నికల్లో కొండా సురేఖను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు పిలుపునిచ్చారు. వరంగల్ 37వ డివిజన్ తూర్పుకోటలో మురళీధర్ రావు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు పార్టీల నేతలతోపాటు మార్కెట్ మాజీ డైరెక్టర్ సంగరబోయిన చందర్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు.

కొమురం భీం ఆశయ సాధనకు కృషి



నివాళులర్పిస్తున్న నారాయణ, తదితరులు

కేయూ క్యాంపస్: కొమురం భీం ఆశయాల సాధనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ కార్యాలయం వద్ద కొమురం భీం 83వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం జల్, జంగిల్, జమీన్ నినాదంతో పోరాడాలని సూచించారు. కొమురం భీం పోరాటాల ఫలితంగానే ఆదివాసీలకు అటవీ భూములపై హక్కు వచ్చిందని గుర్తుచేశారు. అయితే ఆదివాసీలు ఇంకా అనేక రంగాల్లో వెనుకబడే ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు వజ్జ నర్సింగరావు, బాధ్యులు పూనెం సతీష్, ఊకే నాగేంద్రబాబు, దబ్బకట్ల సోమశేఖర్‌రావు, సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వ్యవసాయ పనులు చేయడం ఇష్టంలేక యువకుడి ఆత్మహత్య

కాశిబుగ్గ: వ్యవసాయ పనులు చేయడం ఇష్టంలేక ఓ యువకుడు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇంటికన్నె - నెక్కొండ రైల్వే స్టేషన్ల మధ్య శనివారం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అప్పలరావు పేటకు చెందిన వడ్డే హర్షవర్ధన్ (19) 2020 – 21వ విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫెయిలై ఇంట్లో ఉంటూ వ్యవసాయ పనులు చేస్తున్నాడు. మళ్లీ పరీక్షలు రాసినా పాస్ కాలేదు. దాంతో వ్యవసాయ పనులు చేయడం ఇష్టంలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రాజు శనివారం కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

కాశిబుగ్గ: గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన ఎస్ఎస్ఎం క్లబ్ ఎదురుగా ఉన్న నూతన బస్‌షెల్టర్‌లో శనివారం చోటుచేసుకుంది. ఇంతేజార్‌గంజ్ ఎస్సై కొమురెల్లి తెలిపిన వివరాల ప్రకారం 65 – 70 ఏళ్ల వయస్సు గల మృతుడి వివరాలకు 87126 85007, 87126 85095 నంబర్లలో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

ఆర్టీసీ యూనియన్ సీనియర్ నాయకుడి మృతి

కాజీపేట రూరల్: కాజీపేటకు చెందిన ఆర్టీసీ ఎంప్లాయీస్ సంఘం యూనియన్ సీనియర్ నాయకుడు టీ.సంజీత్ (65) అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ ఆస్పత్రిలో శనివారం మృతి చెందాడు. విష్ణుపురిలోని స్వగృహంలో సంజీత్ మృతదేహానికి తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సాంబయ్య, జనార్దన్ గౌడ్, శ్రీనివాస్ నివాళులర్పించారు.

బీజేపీ విధానాలతోనే దళితులపై దాడులు



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

ఖిలా వరంగల్: బీజేపీ విధానాలతోనే దళితులపై దాడులు అధికమయ్యాయని, సామాజిక న్యాయాన్ని బీజేపీ సమాధి చేస్తోందని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ అన్నారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఎలేందర్ అధ్యక్షతన దళిత సమ్మిట్ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై 300 రెట్లు దాడులు పెరిగాయని వాపోయారు. ఈక్రమంలో ప్రజలంతా ఐక్యమై ప్రజా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 4న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో భిక్షపతి, జన్ను రవి, జాన్ పాల్, రాజేందర్, దేవరాజు, హరిబాబు, పైడి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

వైఎస్.రెడ్డి సేవలు మరువలేనివి



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ గణిత విభాగం ప్రొఫెసర్ వైఎస్.రెడ్డి సేవలు మరువలేనివని నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ శ్రీనివాసచార్య తెలిపారు. వైఎస్.రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో కంప్యూటేషన్ మోడలింగ్ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును శనివారం నిర్వహించారు. ఉద్యోగ విరమణ సందర్భంగా వైఎస్.రెడ్డిని సన్మానించారు.

సేవ ద్వారానే గుర్తింపు

హసన్‌పర్తి: సేవ చేయడం ద్వారానే గుర్తింపు లభిస్తోందని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు అన్నారు. హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 16ఏళ్ల పాటు ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన దేదావత్ సుశీల సన్మాన సభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా చకిలం రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగికి బదిలీ, పదవీ విరమణ అనివార్యమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి, పూర్వ ప్రధానోపాధ్యాయుడు బీ.కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌వీ నూతన కార్యవర్గం

విద్యారణ్యపురి: హనుమకొండలో 9వ డివిజన్ బీఆర్ఎస్‌వీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయితేజ్, ఇన్‌చార్జ్‌గా కిషోర్‌తోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం బీఆర్ఎస్‌వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌ను విమర్శిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. రాజకీయ లబ్ధి పొందేందుకు వినయ్‌భాస్కర్‌పై నాయిని రాజేందర్‌రెడ్డి ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

కార్మికులు అండగా నిలవాలి

కాజీపేట: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్‌కు భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు ఓటేసి గెలిపించాలని కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేలు సారంగపాణి కోరారు. కాజీపేట మండల కేంద్రంలోని కార్మిక అడ్డాలో శనివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంజాముల మల్లేశం, పాలడుగుల శివకుమార్, మారగోని విజేందర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు వినయ్‌భాస్కర్‌కే ఉంది

హన్మకొండ: అపార్ట్‌మెంట్ వాసులను ఓటు అడిగే హక్కు దాస్యం వినయ్‌భాస్కర్‌కు మాత్రమే ఉందని అపార్ట్‌మెంట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రెంటాల కేశవరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్‌ను గెలిపించాలని కోరుతూ అపార్ట్‌మెంట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హనుమకొండలో అపార్ట్‌మెంట్లలో శనివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గుర్రాల ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నడుముల విజయకుమార్, జాయింట్ సెక్రటరీ ప్రసాద్‌రెడ్డి, ప్రతినిధులు కొమురవెల్లి శ్రీనివాస్, మల్లారెడ్డి, జయపాల్ రెడ్డి, బైరెడ్డి శ్రీనివాసరెడ్డి, దోమకొండ రాజు పాల్గొన్నారు.

మూడోసారి బీఆర్ఎస్‌కే పట్టం

హసన్‌పర్తి: మూడోసారి బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని హసన్‌పర్తి మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పెసరు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ అన్నారు. అందుకు భట్టుపల్లిలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు వచ్చిన జనమే నిదర్శనమని తెలిపారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సభకు జనం పోటెత్తారని తెలిపారు. అరూరి రమేష్‌పై పోటీ చేయడానికి ప్రతిపక్షాల అభ్యర్థులు భయపడుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జక్కు రమేష్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సుభాష్, యూత్ మండల అధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, మాజీ రవీందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం

ఖిలా వరంగల్: నవంబర్ 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి నరేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ అన్నారు. వరంగల్ తూర్పు కోటలో బోగి సురేష్ అధ్యక్షతన శనివారం జరిగిన డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. విజయ్, రాంబాబు, ధర్మరాజు, వాసుదేవ్, వేణు, అరుణ్, ప్రభాకర్, రవీందర్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

మడికొండ: 64వ డివిజన్ మడికొండ గ్రామంలోని మృతుల కుటుంబ సభ్యులను వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ శనివారం పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకుడు న్యాత శ్రీనివాస్, బోగి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి, దర్గా సొసైటీ చైర్మన్ వనంరెడ్డి, జనాపట్ల సారయ్య, వెన్నమల్ల రమేష్, దువ్వ శ్రీకాంత్, మూల నాగరాజు, బండారి మహేందర్ పాల్గొన్నారు.

కేయూ వద్ద రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఉద్యమకారులకు అసెంబ్లీ టికెట్ల కేటాయింపులో మొండిచేయి చూపారని ఆరోపిస్తూ బీసీ సంఘం, నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో కేయూ గేట్ వద్ద పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యమకారులను ఏ పార్టీ కూడా గుర్తించడం లేదని వాపోయారు. కార్యక్రమంలో కేయూ బీసీ సంఘం బాధ్యులు సుదగాని మధు, బాధ్యులు శ్రీశైలం, అజిత్, రాజుకుమార్, నవీన్, ప్రేమ్, శ్రవణ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.2లక్షలు స్వాధీనం



ఖిలా వరంగల్: వరంగల్ ఆర్టీఏ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్ట్ వద్ద మామునూరు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కోమట్లగూడెం గ్రామానికి చెందిన రైతు ఒబుల రాంరెడ్డి నుంచి రూ.2,38,750లను స్వాధీనం చేసుకున్నారు. ఆధారాలు లేకపోవడంతో ఆ నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తెలిపారు.